## క్లుప్తంగా

### సీజనల్ వ్యాధులపై అవగాహన



బోనుపల్లిలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సాయిపూజ

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు సాయిపూజ సూచించారు. ఆదివారం మండలంలోని బోనుపల్లి వైఎస్సార్ యానాది కాలనీలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని జ్వర పీడితులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల కారణంగా మలేరియా, డెంగీ, టైఫాయిడ్ లాంటి వైరల్ ఫీవర్స్ అధికంగా వ్యాపిస్తాయన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, క్రమం తప్పకుండా వేడి నీరు తాగడం, వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా విష జ్వరాల బారిన పడకుండా ఉండవచ్చని తెలియజేశారు. అనంతరం కాలనీలో పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి శివకుమార్, సూపర్‌వైజర్ ధనమ్మ, ఏఎన్‌ఎం రాజ్యలక్ష్మి, ఆశా వర్కర్లు జయంతి, కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

### 27న మండల సర్వసభ్య సమావేశం

సత్యవేదు: మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు ఎంపీపీ వి.ప్రతిమ అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొంటారని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

### బలిజ సంఘం బలోపేతానికి కృషి



బాల మురళీకృష్ణను సన్మానిస్తున్న సంఘం నాయకులు

సత్యవేదు: బలిజ సంఘం బలోపేతానికి కృషి చేస్తామని అధ్యక్షుడు బాల మురళీకృష్ణ తెలిపారు. సత్యవేదులోని ఎన్జీవో భవనంలో ఆదివారం బలిజ సంఘం సమావేశం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథులుగా ఆడిటర్ రోశయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు రమేష్, నాగూర్, త్యాగరాజు పాల్గొని నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సత్యవేడు పట్టణానికి చెందిన బాల మురళీకృష్ణ, సెక్రటరీగా చంద్రశేఖర్, గౌరవ అధ్యక్షుడిగా కేసీపీ సత్య, గౌరవ కార్యవర్గ అధ్యక్షుడిగా సుబ్రమణ్యం, కోశాధికారిగా పగడాల చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. గణేష్, కృష్ణ, సంతోష్, కోటి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ స్తంభాల ఏర్పాటు



విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

ఏర్పేడు: మండలంలోని రాజులపాలెం డొంక మార్గంలో ఆదివారం విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. రాజులపాలెం నుంచి కొత్త ఎస్సీ కాలనీకి వెళ్లే డొంకమార్గంలో విద్యుత్ స్తంభాలు లేనందున జనం రాత్రివేళ వెళ్లడానికి ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి ద్వారా గ్రామస్తులు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి విన్నవించారు. ఎమ్మెల్యే సూచనల మేరకు విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సుబ్రమణ్యం, రమేష్, జగదీష్, రాజా తదితరులు పాల్గొన్నారు.

### ముళ్ల పొదల తొలగింపు



శ్మశానం రోడ్డును చదును చేస్తున్న దృశ్యం

వరదయ్యపాళెం: మండలంలోని యానాది వెట్టు గ్రామ శ్మశానానికి వెళ్లే దారిలో ఏపుగా పెరిగి రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్న ముళ్ల పొదలను ఆదివారం జేసీబీతో తొలగించారు. స్థానిక సర్పంచ్ సామర్ల సుజాతమ్మ మాట్లాడుతూ ముళ్లపొదలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అందువల్లే చెట్లను తొలగించామని చెప్పారు. అలాగే గుంతలమయంగా మారిన దారిని చదును చేసినట్టు వివరించారు.










శ్రీకాళహస్తి: కనకాచలంపై మహాదుర్గగా దుర్గమ్మ, ఆలయంలో ఉత్సవమూర్తికి కుంకుమార్చన, బియ్యపు కృష్ణారెడ్డి మండపంలో మహిషాసుర మర్దినిగా దుర్గమ్మ, బొమ్మలకొలువులో సిద్ధధాత్రిగా కొలువైన అమ్మ, కనక దుర్గాదేవికి మహాదుర్గాదేవి అలంకరణ

# మహిషాసుర మర్దినిగా జ్ఞానప్రసూనాంబ

శ్రీకాళహస్తి : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు ఆదివారం వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని జ్ఞానప్రసూనాంబ ఉత్సవమూర్తి మహిషాసుర మర్దిని అలంకరణలో అనుగ్రహించారు. ఆయుధాలకు పూజలు చేసిన అనంతరం అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి, అనంతరం మహిషాసుర మర్దినిగా అలంకరించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించి రంగుల గోపురం వరకు ఊరేగించారు. ఆలయంలో బొమ్మలకొలువులో అమ్మవారి ఉత్సవమూర్తి సిద్ధదాత్రిగా దర్శనమిచ్చారు. కనక దుర్గమ్మ మహాదుర్గమ్మగా కటాక్షించారు. కనకాచలం మీద వెలసిన దుర్గమ్మ మహిషాసుర మర్దిని అలంకరణలో కటాక్షించారు. పట్టణంలోని పలు ఆలయాల్లో వివిధ రూపాల్లో అమ్మవారు కొలువుదీరారు. ఏడుగంగల మహాగౌరి అమ్మవారిని దర్శించుకున్నారు. పొనగల్ పొన్నాలమ్మ, బీపీ అగ్రహారం పెద్ద గంగమ్మ, చిన్నగంగమ్మ దుర్గాదేవి ఆలయంలో కనక దుర్గమ్మ, బియ్యపు కృష్ణారెడ్డి మండపంలో ఉత్సవమూర్తి మహాదుర్గగా, ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ, త్రిశూలాంబ ఆలయం తరపున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

**ఏర్పేడులో..**

ఏర్పేడు: మండలంలోని చిందేపల్లిలో వెలసిన అమ్మవారి ఆలయాల్లో శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పార్వతీదేవి అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పాపానాయుడుపేట భద్రకాళి, అంజిమేడు గంగమ్మ, గుడిమల్లం ఆనందవల్లీ దేవి, మూలకండ్రిగ ఓసూరమ్మ ఆలయాల్లో అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



శ్రీకాళహస్తి : మహిషాసుర మర్దినిగా భక్తులను అనుగ్రహిస్తున్న జ్ఞానప్రసూనాంబ అమ్మవారు

**సరస్వతీదేవిగా అవనాక్షమ్మ**

నారాయణవనం: మండలంలోని సముదాయంలోని టీటీడీ అనుబంధ అవనాక్షమ్మ ఆలయంలో అమ్మవారు ఆదివారం జ్ఞాన ప్రదాత సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి సర్కారు అభిషేకాన్ని నిర్వహించి దూప దీప నైవేద్యాలు సమర్పించారు. టీటీడీ స్థానిక ఆలయాల ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారి నాగరాజు ఉత్సవాలను పర్యవేక్షించారు. అదేవిధంగా కైలాసనాథ కోనలోని కామాక్షాంబిక సమేత కైలాసనాథస్వామి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా కుంకుమ అలంకరణలో భక్తులను అనుగ్రహించారు. ఈ సందర్భంగా ఆలయంలో చండీ హోమం నిర్వహించారు. స్థానిక ధర్మరాజుల ఆలయంలో సాయంత్రం ద్రౌపదీదేవి దుర్గాదేవి భక్తులకు దర్శనమిచ్చారు.

**దుర్గాదేవిగా సర్వమంగళాదేవి**

సత్యవేదు: వీరభద్రస్వామి ఆలయంలోని సర్వమంగళాదేవి దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని నిమ్మకాయలు, పూలతో విశేషంగా అలంకరించారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. వారికి అర్చకులు కుంకుమ, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

**పళ్లికొండేశ్వర శయన అలంకారంలో మరకదాంబిక**

నాగలాపురం: సర్వమంగళా సమేత పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు శ్రీపళ్లికొండేశ్వర శయన అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం 5 గంటలకు పంచామృతంతో అభిషేకాలు చేశారు. ఈ రోజు ఉభయదారులుగా చెన్నై టి.నగర్‌కి చెందిన ఇ.కార్తికేయన్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఏవీఎం మునిచంద్రశేఖర్ రెడ్డి (బాలాజీ రెడ్డి), ఈఓ రామచంద్రారెడ్డి, పాలక మండలి సభ్యులు కె.ఆనంద్, జి.మునివేలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ధనలక్ష్మిగా వేదవల్లి తాయారు**

నాగలాపురం: స్థానిక టీటీడీ అనుబంధ శ్రీ వేదవల్లి సమేత వేదనారాయణ స్వామి ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. కార్యక్రమంలో టీటీడీ ఏఈఓ పార్థసారథి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ప్రధాన అర్చకులు నాగరాజు భట్టాచార్యులు పాల్గొన్నారు.

**దుర్గాదేవి అలంకరణలో కామాక్షమ్మ**

వరదయ్యపాళెం: మండలంలోని అంబూరులో వెలసిన కామాక్షమ్మ ఆదివారం దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.



సత్యవేదు: దుర్గాదేవిగా సర్వమంగళాదేవి



శ్రీపళ్లికొండేశ్వర శయన అలంకారంలో అమ్మవారు








ఏడు గంగమ్మల గుడిలో కొలువుదీరిన మహాగౌరి, ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ, నారాయణవనం: కైలాసనాథకోనలో దుర్గాదేవిగా కామాక్షాంబిక, ధనలక్ష్మిగా శ్రీ వేదవల్లి తాయారు, ఏర్పేడు: దుర్గాదేవిగా పార్వతీదేవి, నారాయణవనం: కామాక్షిగా అవనాక్షమ్మ

# ప్రజల వద్దకే సంక్షేమ పాలన




వృద్ధ దంపతులను ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, మహిళకు ఈ నాలుగున్నరేళ్ల పాలనలో అందిన సంక్షేమ ఫలాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధు

- సీఎం జగనన్న ప్రభుత్వంలోనే రాష్ట్ర అభివృద్ధి
- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: ప్రజల వద్దకే పాలన తెచ్చిన ఘనత సీఎం జగనన్నదే అని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధు సూదన్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలోని 9వ వార్డులో యానాది సెంటర్, పీవీరోడ్, హరహరబావి, ఫైర్ స్టేషన్, బ్రాహ్మణవీధి, గాండ్ల వీధి, సీతాలమ్మగుడి వీధుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన 740 ఇళ్లకు వెళ్లి ప్రజలతో మమేకమయ్యారు. కార్యక్రమంలో భాగంగా ఆయన స్థానిక ఆలయంలో ప్రత్యేక పూజలు చేయగా స్థానికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేసిన సంక్షేమ లబ్ధిని వివరించి బుక్‌లెట్లను లబ్ధిదారులకు అందజేశారు. స్థానికులు తమ వార్డు పరిధిలోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**సంక్షేమ ప్రభుత్వం మాది..**

కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా చాలా సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు విజయవాడకే పరిమితమయ్యే వారని, వారి సొంత వ్యాపారాలతో బిజీగా ఉంటూ ప్రజల వద్దకు వచ్చే వారు కాదని గుర్తు చేశారు. కానీ జగనన్న సీఎం అయ్యాక ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు నిత్యం ప్రజల మధ్య ఉండాలని ఆదేశించారన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతున్నాయా ? లేదా అని తెలుసుకోవడంతో పాటు అభివృద్ధిపైనే దృష్టి సారించారని తెలిపారు. ప్రజాసంక్షేమ పాలన కొనసాగాలంటే ముఖ్యమంత్రిగా జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్ రావు పవార్, ముత్యాల పార్థసారథి, రామచంద్రారెడ్డి, రఘునాయుడు, అల్తాఫ్, పాలమంగలం రవి, పవన్, శోభన్ నాయుడు, గఫూర్, బాబు, ఆర్కాట్ శేఖర్, మునిలక్ష్మి, మాధవి, ప్రమీలమ్మ, మ్యాగి క్లారా, మస్తానీ, ధనలక్ష్మి, చిన్నరాయుడు, వెంకటేశ్వర్లు, చక్రాల మురళి, బుల్లెట్ జయశ్యామ్, ఫరీద్, సుమతి, సాగిరాభి, రుష్యేంద్రమణి, షర్మిళ టాగూర్, పద్మ, పుష్ప, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## పోలినాంచారమ్మ ఆలయంలో పూజలు



పోలి నాంచారమ్మకు సారెను తీసుకుని వెళ్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

ఏర్పేడు: మండలంలోని కోబాక పోలినాంచారమ్మ ఆలయంలో ఆదివారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి పూజలు చేశారు. శరన్నవ రాత్రుల సందర్భంగా గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఆలయానికి చేరుకుని చీర, సారెను అందజేశారు. ఆలయంలో అర్చనలు, పూజలు నిర్వహించారు. సర్పంచ్ బుజ్జమ్మ, నేతలు మునిరత్నంరెడ్డి, గాలి గుణశేఖర నాయుడు, విజయ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



**తొట్టంబేడులో...**

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): ఆలయాలు ప్రశాంతతకు నిలయాలు అని మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చిట్టత్తూరు హరిజనవాడలో జరిగిన శ్రీ మాతమ్మ తల్లి ఆలయ కుంభాభిషేకం వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణమూర్తి, ఎంపీటీసీ నరసింహులు, నాయకులు పాల్గొన్నారు.



కుంభాభిషేక వేడుకల్లో బియ్యపు పవిత్రారెడ్డి

## ముక్కంటి సేవలో ప్రముఖులు

ఆలయ ధ్వజస్తంభం వద్ద ఎమ్మెల్యే మల్లాది విష్ణు, జడ్జి స్మితాగోపాల్

శ్రీకాళహస్తి: ముక్కంటీశ్వరున్ని ఆదివారం విజయవాడ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, అలాగే అహ్మదాబాద్ హైకోర్టు జడ్జి స్మితాగోపాల్ కుటుంబ సభ్యులతో కలిసి వేర్వేరుగా దర్శించుకున్నారు. వారికి ఆలయ దక్షిణ గోపురం వద్ద వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అధికారులు వారికి స్వామి, అమ్మవార్ల ప్రత్యేక దర్శనం చేయించి వేదపండితులతో ఆశీర్వాదం ఇప్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ విజయ సారథి, పీఆర్ఓ నాగభూషణం నాయక్, టెంపుల్ ఏఈఓ ధనపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

శ్రీకాళహస్తి: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఆదివారం ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇర్ల రాజా మోకాళ్ల మీద కనకాచలం మెట్లు ఎక్కి అమ్మవారిని దర్శించుకున్నారు. డిసెంబర్‌లో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు మద్దతుగా కేంద్ర ప్రభుత్వం సహకరించేలా వారిలో మార్పు రావాలని అమ్మవారిని కోరినట్లు ఆయన తెలిపారు.



మోకాళ్ల మీద కనకాచలం మెట్లు ఎక్కుతున్న రాజా